క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. ఈ క్రమంలో పటాన్‌చెరులోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం గురుకులంలో చార్ట్‌పై సీఎం ఫొటో అతికించి, థ్యాంక్యూ సీఎం సార్ అంటూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు నమోదు చేయించుకోవాలి



ఓటు నమోదు ఫారాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఆశాజ్యోతి

మునిపల్లి(అందోల్): అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఆశాజ్యోతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బుదేరాలో ఓటు నమోదు చేయించుకోవాలని ప్రచారం నిర్వహించారు. 2025 జనవరి 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు పూర్తయిన యువతి, యువకులు ఈ నెల 28వ తేదీ వరకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9 నుంచి జనవరి 1 వరకు ప్రత్యేక క్యాంపెయిన్ ఉ.9 గంటల నుంచి సా. 5 గంటల వరకు (బీఎల్ఓ) బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారన్నారు.

కూలీల కొరత.. రాలుతున్న పత్తి



ఇబ్రహీంపూర్ సమీపంలో రాలుతున్న పత్తి

న్యాల్‌కల్(జహీరాబాద్): కూలీల కొరత కారణంగా పత్తి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటను ఇంటికి తీసుకువచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3.50లక్షలు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో చేతికి వచ్చిన పత్తి పంట పూర్తిగా విప్పుకొని నేల రాలుతోంది. వర్షాల కారణంగా పంట దెబ్బతిని నష్టాల్లో ఉన్న రైతులకు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎటు చూసినా పొలాల్లో తెల్లబంగారమే కనిపిస్తుంది.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన అక్కం బీరప్ప కాలేయవ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం బాధిత కుటుంబ సభ్యులు సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డిని సంప్రదించగా ఆయన మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.2లక్షల చెక్కును మంజూరు చేయించారు. దీంతో శనివారం గిరిధర్‌రెడ్డి బాధితులకు చెక్కును అందజేశారు.

శ్రీకృష్ణ గోశాల్లో పూజలు



గోశాలలో పూజలు చేస్తున్న మహిళలు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని శ్రీకృష్ణ గోశాలలో శనివారం గోపాష్టమిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోవులను దర్శనం చేసుకున్నారు. సత్యనారాయణ వ్రతం నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులచే దత్తాత్రేయ శర్మ పూజలు చేయించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. భక్తులు తీసుకువచ్చిన నానబెట్టిన గ్రాసాన్ని ఆవులకు తినిపించారు. అన్నదాన కార్యక్రమానికి వందల సంఖ్యలో పాల్గొన్నారు.

'తెల్ల' బంగారం





సంగారెడ్డి జిల్లా మంజీరా నదీతీరం వెంట రైతులు పత్తి పంటను సాగు చేశారు. మొదట వర్షాలు కురవక మొలకలు రాలేదు. వర్షాలు పడిన తరువాత ఆకుపచ్చగా కళకళలాడింది. పూత బాగా వచ్చి పత్తి మొక్కలు విరగకాశాయి. దీనితో చేనంతా తెల్లగా కనిపిస్తుంది. ఫసల్‌వాది శివారులో కనిపించిన ఈ దృశ్యాలను సాక్షి క్లిక్ మనిపించింది. -సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

సహస్రార్జున మహరాజ్‌కు నివాళి

సదాశివపేట(సంగారెడ్డి): సోమవంశ సహస్రార్జున మహరాజ్ జయంతి వేడుకల సందర్భంగా శనివారం ఎస్ఎస్కే సమాజం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు రాజేశ్వర్, బీఆర్ఎస్ 19వ వార్డు ఇన్‌చార్జి శివ, సమాజ్ సభ్యుడు రఘుప్రసాద్, రాజు, శ్రీధర్, అశోక్, సచిన్ పాల్గొన్నారు.

రేపు గురుపాదుకార్చన

నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో రేపు శివపంచాక్షర జపయజ్ఞసహిత శ్రీగురుపాదుకార్చన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఫస ల్వాది శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, సాయికుమార్

కల్హేర్(నారాయణఖేడ్): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వెల్లడించారు. శనివారం సిర్గాపూర్ మండలం నల్లవాగు ప్రాజెక్టులో రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చేప పిల్లలు విడుదల చేయకుండా కమీషన్లు పొందారని ఆరోపించారు. అలాగే, సాయికుమార్ మాట్లాడుతూ.. మత్స్యకారులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రమాలు లేకుండా చేప పిల్లల పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సింహరావు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నర్సింలు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాం, నల్లవాగు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రవి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో నల్లవాగు నీరు విడుదల

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు నుంచి రబీ పంటల సాగుకు నీటిని విడుదల చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. శనివారం సిర్గాపూర్ మండలం నల్లవాగు ప్రాజెక్టు వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద 3 వేల నుంచి నాలుగు వేల ఎకరాల వరకు ఆరుతడి పంటలు సాగు చేసేందుకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. త్వరలో తైబందీ నిర్వహించి కలెక్టర్ సమక్షంలో జరిగే డీఐబీ సమావేశంలో ఆయకట్టును నిర్ధారిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, డీఈఈ పవన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, జయరాజు, సాయిలు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

కల్హేర్(నారాయణఖేడ్): సర్వే పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేస్తే ఆధార్ కార్డు, ఓటీపీ, బ్యాంక్‌కు సంబంధించిన వివరాలు ఇవ్వొద్దని సూచించారు. ఏపీకే ఫైల్ ఓపెన్ చేయవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే డబ్బులు పోగొట్టుకోవాల్సి వస్తుందని వివరించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శనివారం తెల్లాపూర్‌లో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు ఉదయం, సాయంత్రం వేళలో ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. నిత్యం యోగా, సైకిలింగ్, వాకింగ్, ఇష్టమైన క్రీడాలు ఆడాలన్నారు. దీంతో రోజంతా ఉల్లాసంగా ఉంటామన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని భారతీనగర్, రామచంద్రపురం, పటాన్‌చెరు డివిజన్ పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.13 కోట్ల 20 లక్షల నిధులు కేటాయించాలని ఆ శాఖ ఎండీ అశోక్‌రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. బల్దియా పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతో పాటు, పాత కాలనీల్లో అంతర్గత మురుగునీటి కాల్వలు , సీసీ రోడ్ల పనులు చేపట్టేందుకు ప్రణాళికల సిద్ధం చేసినట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. వీటితో పాటు గతంలో జలమండలికి కేటాయించిన ఆర్‌హెచ్‌సీ ప్రాంతంలో ఆస్పత్రిలో సేవలు లేనందున స్థానిక అవసరాల కోసం జీహెచ్‌ఎంసీకి కేటాయించాలని విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్‌రెడ్డి త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తా

● చైర్మన్ కొప్పుల లక్ష్మి



పాలకవర్గ సమావేశంలో లక్ష్మి, తదితరులు

వట్ పల్లి(అందోల్): వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మార్కెట్ చైర్మన్ కొప్పుల లక్ష్మి అన్నారు. శనివారం తన చాంబర్‌లో చైర్మన్ లక్ష్మి అధ్యక్షత తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమపై నమ్మకంతో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన అభివృద్ధి పనులు, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు సహకారాలపై చర్చించి, ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. మంత్రి సహకారంతో ముందుకెళ్తామన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని మూడు మండలాల రైతులు తమ పండించిన పత్తి పంటను దళారులకు అమ్మకుండా సీసీఐ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, కార్యదర్శి సునీల్‌తో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

సంగారెడ్డి : పట్టణంలోని రిషి హైస్కూల్‌లో సంగారెడ్డి వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా క్యాంప్ నిర్వహించారు. క్యాంపులో 350 మంది స్టూడెంట్స్, టీచర్లు నాన్ టీచింగ్, స్కూల్ సిబ్బందికి ఈసీజీ , షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి పేదవాడు వైద్యం చేయించుకునేలా వైద్యం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్స్ డా.హరిత , మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి, టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



సంజీవరెడ్డిని సత్కరిస్తున్న హరీశ్‌రావు, మాణిక్‌రావు

జహీరాబాద్: మాజీ మంత్రి హరీష్‌రావును జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, పార్టీ నాయకులు కలిశారు. మొగుడంపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నియమితులైన సంజీవరెడ్డి శనివారం క్యాంపు కార్యాలయానికి వెళ్లి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నియమితులైన పీఏసీఎస్ మాజీ చైర్మన్ సంజీవరెడ్డిని హరీష్‌రావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశలో పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలు తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు పెంటారెడ్డి, తట్టు నారాయణ, నర్సింహులు, రాజశేఖర్, పర్వేజ్, చిన్నారెడ్డి, కరణ్‌రాజ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఒక్క రోజులో 10నుంచి 14 ఇళ్లు సర్వే చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రజలందరు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



ఝరాసంగం: వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్, తదితరులు



కల్హేర్ : వివరాలు నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మునిపల్లి: సర్వే చేస్తున్న అధికారులు



జిన్నారం: సర్వేలో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డి



సదాశివపేట రూరల్: సర్వేను ప్రారంభిస్తున్న సీడీసీ చైర్మన్ రాంరెడ్డి

ఆశలకు వేతనాలు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఆశ కార్మికులకు వేతనాలు పెంచకుంటే మరో పోరాటం తప్పదని ఆశవర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్ లో ఆశవర్కర్ల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశవర్కర్లు గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్నా.. వారికి కనీస వేతనం లేదన్నారు. అనేక రకాల సర్వేల పేరుతో పేదలకు సేవలందిస్తున్నారని, కరోనా కష్టకాలంలో కూడా ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రభుత్వం వీరిని గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, అప్పటివరకు ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి, నాయకులు యశోద, ప్రశాంతి, వీరమని, శాంతికుమారి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కొనుగోలు కేంద్రం తనిఖీ**

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం నాగధర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ డీపీఎం జయశ్రీరాజ్ శనివారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సాయిలు, సీసీ దుర్గయ్య పాల్గొన్నారు.

◆ **సంస్కృతి, సంప్రదాయాలు పరిక్షించాలి**

నారాయణఖేడ్: బంజారా యువకులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు ధర్మరక్షణకు పాటు పడాలని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, ముంగి ఆదిలక్ష్మి, పీఠాధిపతి దేవగిరి మహరాజ్ అన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్‌లో గిరిజన యువకులకు సంస్కృతి, సంప్రదాయాలు, బాష, వేషాధారణపై అవగాహన కల్పించారు. గిరిజన యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాభివృద్ధితో ముందుకు సాగాలన్నారు. గిరిజనుల వేషాధారణను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరక్‌పల్లి పీఠాధిపతి దేవిదాస్ మహరాజ్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, రాజునాయక్, లక్ష్మణ్ చౌహాన్ పాల్గొన్నారు.

◆ **బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయి బాషా**

సంగారెడ్డి రూరల్: తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డి పట్టణానికి చెందిన సాయి బాషాను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కష్టయ్య శనివారం హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి బాష ఆర్ కష్టయ్యకు కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ సంబంధిత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు, పట్నం మాణిక్యం ఫౌండేషన్ సభ్యులు, శ్రీకాంత్, రోహిత్‌గౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **డబ్బులు చేయాలని ధర్నా**



జహీరాబాద్ టౌన్: పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు శనివారం ధర్నా చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్, జిల్లా నాయకులు నామ రవికిరణ్ తదితరులు సందర్శించి కార్మికులతో కలిసి ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నామ రవికిరణ్ మాట్లాడుతూ కార్మికుల 11 నెలల పీఎఫ్ , 6 నెలల ఈఎస్ఐ డబ్బులను జమ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కొన్ని రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించడంలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్, రాకేష్, మహ్మద్‌అలీ, శ్రీకాంత్, గణేష్, సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

◆ **ఓటరు నమోదు ప్రారంభం**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ గంగాభవాని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ మేరకు శని ఆదివారాల్లో రెండు రోజుల పాటు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, సవరణలు ఈ ప్రక్రియలో చేసుకోవచ్చన్నారు. అలాగే, ఆన్‌లైన్‌లో ఓటర్ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, ఓటర్లు పాల్గొన్నారు.

◆ **పెళ్లికి ఆర్థిక సాయం**

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణానికి చెందిన సువర్ణ కుల్‌కర్ణి కుమార్తె దివ్య కుల్‌కర్ణి వివాహానికి బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. శనివారం పెళ్లి వేడుకకు సంఘం సభ్యులు హాజరై రూ.21వేల ఆర్థిక సహాయం చేశారు. పేద కుటుంబానికి ఉడతా భక్తిగా సహకారం అందించామన్నారు.

హరీశ్‌రావుకు ఘన స్వాగతం



హరీశ్‌రావును సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): మెదక్‌లో జరిగిన రైతు ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల నాయకులు ఘనస్వాగతం పలికారు. గుమ్మడిదల సమీపంలోని స్థానిక టోల్‌గేట్ వద్ద హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు పథకాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రైతులకు అన్ని విధాల ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు హరీష్‌రావుతో కలిసి రైతు ధర్నా కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు శ్రీని వాస్‌రెడ్డి, రాజేష్, వేణు,మురళి, వెంకటేష్ మొగు లయ్య, మల్లేష్ గౌడ్, సంతోష్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వరకట్నం తీసుకోవడం నేరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న శ్రీధర్

కల్హేర్(నారాయణఖేడ్): వరకట్నం తీసుకోవడం చట్టరీత్యా నేరమని నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ శ్రీధర్ మంథని తెలిపారు. శనివారం సిర్గాపూర్ మండలం నల్లవాగు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మేజిస్ట్రేట్ శ్రీధర్ మంథని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని అన్నారు. నేరాలు అరికట్టేందుకు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చట్టాల గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, న్యాయవాదులు బోజిరెడ్డి, మారుతిరెడ్డి, జీవన్ పాల్గొన్నారు.